

ములగపూడిలో డయేరియా



రోగితో మాట్లాడుతున్న వైద్యులు

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని ములగపూడి గ్రామంలో ఆరుగురికి డయేరియా సోకినట్లు వైద్యులు సౌందర్య, సౌజన్య సోమవారం తెలిపారు. గ్రామంలో ఎస్‌సి కాలనీలో జరిగిన ఓ విందు కార్యక్రమం జరిగిందని ఆ విందులో పాల్గొన్న వారికి డయేరియా సోకినట్లు తెలిపారు. మెరుగైన వైద్య సేవలు నిమిత్తం రౌతులపూడి సిహెచ్‌సికి తరలించామని, డయేరియా సోకిన వారి ఆరోగ్యం నిలకడగా ఉందని వెల్లడించారు. గ్రామంలో పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టడంతోపాటు వాటర్ ట్యాంక్ క్లోరినేషన్ చేయించడం జరిగిందన్నారు.

నిబంధనలు పట్టవా..?

తయారీ కేంద్రాల వద్ద కానరాని భద్రతా చర్యలు
తరచూ బాణసంచా ప్రమాదాలు
తూతూ మంత్రంగా అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

అందరి జీవితాల్లో వెలుగులు వెల్లివిరియాలని ఏటా కులమతాలకతీతంగా దీపావళి పండుగ జరుపుకుంటారు. బాణ సంచా కాలుస్తారు. ఆరోజంతా ఎంతో ఆనందంగా గడుపుతారు. అయితే అధికారుల పట్టనితనం, వ్యాపారుల నిర్లక్ష్యం వెరిసి కొందరి జీవితాల్లో చీకటి అలముకుంటుంది. ప్రతి ఏటా బాణసంచా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా.. అటు వ్యాపారుల్లో గానీ, ఇటు అధికారుల్లో గానీ మార్పు రావట్లేదు. తాజాగా అమలాపురంలో ఓ ఇంట్లో బాణసంచా తయారు చేస్తుండగా పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ఏడుగురు తీవ్రంగా గాయపడగా. భవనం కుప్పకూలింది. చుట్టుపక్కల ఇళ్లు కూడా పేలుడు ధాటికి కుప్పకూలింది. ఈ ఘటనలోనూ అధికారుల అలసత్వం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. కొన్నేళ్లుగా ఆవాసాల మధ్యనే ఇలా మందుగుండు సామగ్రిని పెట్టుకుని బాణసంచా తయారు చేస్తున్నా పట్టించుకోకపోవడం వెనుక పలు అనుమానాలు తలెత్తుతున్నాయి.

నిబంధనలకు పాతర

నివాస గహాలు, పెట్రోల్ బంకులు, జన సంచారం ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో బాణ సంచా దుకాణాలను ఏర్పాటు చేయకూడదనే నిబంధనలు ఉన్నా ఎక్కడా అమలు కావట్లేదు. పలు ప్రాంతాల్లో జన సంచారం ఎక్కువగా ఉన్న చోట కూడా తయారీ, అమ్మకాలు సాగిస్తున్నారు. అనుమతులు ఒక చోట తీసుకుని మరోచోట తయారు చేస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలూ వినిపిస్తున్నాయి. కొన్ని చోట్ల ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే తయారీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. బాణ సంచా అక్రమ తయారీ జరుగుతున్నా, లైసెన్స్‌లు రెన్యువల్ కాకపోయినా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.


అమలాపురం ఘటనలో గాయపడిన బాధితులు

గతంలో జరిగిన ఘటనలు

2006లో సామర్లకోట మండలం వేట్లపాలెంలోని బాణసంచా కేంద్రంలో జరిగిన ప్రమాదంలో ఐదుగురు మతి చెందారు. మరి కొంతమంది గాయాలపాలయ్యారు.

2014 అక్టోబర్ 20 న యు.కొత్తపల్లి మండలం వాకతిప్పలో జరిగిన ప్రమాదంలో బాణసంచా తయారు చేస్తుండగా పేలుడు జరిగి ఒక బాలికతో సహా 18 మంది ప్రాణాలు అగ్నికి ఆహుతి అయ్యాయి. మతదేహాలు గుర్తు పట్టలేనంతగా కాలి బుడిదయ్యాయి.

2016 ఎప్రిల్ 4న తునిలో జరిగిన పేలుడులో ఇద్దరు చనిపోయారు.

2018 లో నవంబర్ నెలలో సామర్లకోట మండలం వేట్లపాలెంలో జరిగిన సంఘటనలో ఒకరు చనిపోగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఇదే ఏడాది నవంబరులో జరిగిన ప్రమాదంలో రామచంద్రపురంలో జరిగిన సంఘటనలో నలుగురు గాయపడ్డారు.

2018 సెప్టెంబరు 21న రాజమహేంద్రవరం సుబ్బారావు పేటలో జరిగిన ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మత్యువాత పడ్డారు. 20 ఏళ్లుగా బాణాసంచా తయారీ చేసి విక్రయిస్తున్న ఆటో డ్రైవర్ ముత్యాల రెడ్డి నిబంధనలకు విరుద్ధంగా ఒక జనావాసాల మధ్య ఒక ఇంటిలో బాణాసంచా తయారు చేస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దాంతో ముత్యాల రెడ్డి భార్య ధనలక్ష్మి, తల్లి సూర్యకాంతం, కుమరుడు విజయ్ చనిపోయారు. చిన్న కుమారుడు దుర్గారెడ్డి, సమీప బంధువైన బాలిక క్రిి వైష్ణవి తీవ్ర గాయాలతో ప్రాణాపాయం నుంచిబయటపడ్డారు.

2019 సెప్టెంబరు 30న సామర్లకోట మండలం జి.మేడపాడు గ్రామంలో గల బాణాసంచా దుకాణంలో సంభవించిన బాణసంచా పేలుడు ఘటనలో 11 మంది తీవ్ర గాయాల పాలయ్యారు. వీరిలో నలుగురు మరణించారు.

పాలచర్ల సాయిబాబుకు చెందిన బాణాసంచా దుకాణంలో సంభవించిన ఈ పేలుడుతో గ్రామమంతా ఉలిక్కిపడింది. నిరు పేద మహిళలు కావడంతో ఆ కష్టజీవుల ఇంట పేలుడు పెను విషాదాన్ని నింపింది.ఇలా పలు ప్రమాదాలు జరుగుతున్నా అధికారుల్లో చలనం కనిపించడం లేదు.


2014లో యు.కొత్తపల్లి మండలంలో జరిగిన ప్రమాదలో కాలిబూడిదైన మృతదేహాలు(ఫైల్)

ఇవీ నిబంధనలు

18 ఏళ్లు నిండిన వ్యక్తులు మాత్రమే బాణసంచా తయారీ కేంద్రాల్లో పనిచేయాలి. ఫైర్ ఫైటింగ్ విషయాల్లో శిక్షణ తీసుకోవాలి. బాణా సంచా దుకాణం వద్ద తయారీ ప్రదేశాలలో ప్రథమ చికిత్స కిట్లు తప్పనిసరిగా ఉండాలి.నాలుగు ఫైర్ సిలెండర్లు,నాలుగు బకెట్లు,ఒక హై డ్రైఎడ్, నిముషానికి 450 లీటర్ల నీటిని కెపాసిటీ గల ఒక డీజిల్ పంపు,25 వేల లీటర్ల కెపాసిటి గల వాటర్ ట్యాంకు ఉండాలి. అనుమతులకు మించి బాణ సంచా సరుకులను తయారు చేయకూడదు. ప్రమాద నివారణ పరికరాలు పనిచేసే విధంగా ఎప్పటికప్పుడు చూసుకోవాలి. పరికరాలను ఉపయోగించేందుకు నలుగురు ఆపరేటర్లు ఉండాలి. తయారీ దుకాణంలో నలుగురికన్నా ఎక్కువ పనిచేయకూడదు.కేంద్రం చుట్టూ రక్షణను ఏర్పాటు చేయాలి.ఆపరేటర్లు ఎల్లప్పుడూ నాణ్యమైన షఉ ధరించి ఉంచాలి.ప్రమాదకర వస్తువులు, కిరోసిన్ దీపాలు వంటివి వినియోగించకూడదు.1983 ఎక్స్ ప్లోజివ్ చట్టం ప్రకారం అన్ని నిబంధనలు పాటించాలి.తయారీ కేంద్రం దఢంగా సిమెంటుతో కట్టి ఉండాలి.తలుపులు బయటకు వచ్చేలా ఉండాలి.అందరూ ఒకే చోట కూర్చుని పనిచేయకూడదు.ప్రతి రెండు గంటలకు ఒకసారి పనిచేసే వారు బట్టలకు తడి చేసుకుంటూ ఉండాలి.మట్టితో చేసిన వస్తువులను కాకుండా ప్లాస్టిక్ తో చేసిన వస్తువులను వినియోగించాలి.


సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

ఏచూరి మరణం ఉద్యమాలకు తీరని లోటు

ప్రజాశక్తి - పెద్దాపురం

సిపిఎం అఖిలభారత కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి అన్నారు. సోమవారం మండలంలోని దివిలిలో సిఐటియు ఆధ్వర్యంలో ఏచూరి సంస్మరణ సభ జరిగింది. తొలుత ఏచూరి చిత్రపటానికి ఆజాద్ నేషనల్ ఆర్మీ అధ్యక్షులు కొత్తెం వెంకట శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే కమ్యూనిస్టుగా మారి ప్రజా ఉద్యమాలకు పునాదిగా నిలిచారన్నారు. అత్యంత చిన్న వయసులో కేంద్ర కమిటీ సభ్యునిగా, అనంతరం పోలిట్ బ్యూరోకు ఎదిగిన ఆయన సిపిఎం ఆల్ ఇండియా కార్యదర్శిగా ఎన్నో సేవలు అందించారన్నారు. రెండుసార్లు పార్లమెంటు సభ్యునిగా ప్రజా వాణి వినిపించారన్నారు. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటన్నారు. ఆయన నడిచిన బాటలో నడుస్తూ ప్రజా ఉద్యమాలను తీవ్రతరం చేయడం ద్వారానే ఆయనకు నిజమైన నిశాళి అని, ఆయన స్ఫూర్తితో భవిష్యత్‌లో జరిగే ప్రజా ఉద్యమాల్లో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్, దాడి బేబీ, కేదారి నాగు, సిరపరపు శ్రీనివాస్, మంతెన సత్తిబాబు, రేలంగి బుజ్జి, సత్తిబాబు, పెదకాపు, నాని, సూర్యకుమారి, నాగేశ్వరి, చక్రలక్ష్మి, పాల్గొన్నారు.

నగర పాలక సంస్థకు ఎన్నికలు నిర్వహించాలి

ప్రజాశక్తి - కాకినాడ

నగర పాలక సంస్థలో ప్రత్యేక అధికారుల పాలనకు రెండేళ్లు పూర్తియిందని, తక్షణమే ఎన్నికల నిర్వహించి ప్రజాపాలనకు నాంది పలకాలని సిపిఎం నగర కమిటీ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది. సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నగర కమిటీ సభ్యులు కె.సత్తిరాజు, మలక వెంకట రమణ మాట్లాడుతూ 2005లో నగర పాలక సంస్థగా అప్ గ్రేడ్ పొంది ఎన్నికలు నిర్వహించారని, నాటి పాలకవర్గం 2010లో ముగిసిందన్నారు. తదుపరి పరిసర గ్రామాల విలీనం పేరుతో, కోర్టు వ్యాజ్యాల వల్ల 7 సంవత్సరాలపాటు నగరంలో ప్రత్యేక అధికారుల పాలన సాగిందన్నారు. ఈ నేపథ్యంలోనే హైకోర్టు ఆదేశాలతో 2017లో ఎన్నికలు నిర్వహించి సెప్టెంబర్ 16న పాలకవర్గం కొలువుతీరిందన్నారు. 2వ పాలక వర్గం గడువు కూడా 2022 సెప్టెంబర్ 15తో ముగిసి, అదే నెల 16 వ తేదీ నుంచి ప్రత్యేక అధికార పాలన ప్రారంభం అయిందన్నారు. స్థానిక ప్రభుత్వాల ఎన్నికలు క్రమం తప్పకుండా నిర్వహించాలని భారత రాజ్యాంగంలో 73, 74 రాజ్యాంగ సవరణలు చేశారని గుర్తు చేశారు. కాకినాడ నగరంలో 74 వ రాజ్యాంగ సవరణ నిర్లక్ష్యం చేయబడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు ఏవైనా స్థానిక ప్రభుత్వం ద్వారానే అమలు జరుగుతాయన్నారు. ప్రజలు ఎన్నుకున్న పాలక వర్గం లేకపోవడం వల్ల స్థానికంగా ప్రజల దైనందిన సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారం కావడం లేదన్నారు. అధికారుల పాలనకు పరిమితులు ఉంటాయన్నారు. మరొక పక్క పరిసర గ్రామాల విలీనం పేరుతో, కోర్టు వ్యాజ్యాల వల్ల 13 ఏళ్ళుగా ప్రత్యేక అధికారుల పాలన సాగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, గ్రామాల విలీనం సమస్య పరిష్కరించి తక్షణమే కాకినాడ నగర పాలక సంస్థ ఎన్నికలు నిర్వహించాలని వారు కోరారు.

ఐక్యతను దెబ్బతీసేందుకు కుట్రలు : మంత్రి సుభాష్


మంత్రి సుభాష్‌ను సత్కరిస్తున్న మాజీ పిల్లి దంపతులు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

టిడిపి, జనసేన మధ్య ఐక్యతను దెబ్బతీసేందుకు కొన్ని శక్తులు కుట్రలు సాగిస్తున్నాయని కార్మిక శాఖామంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సోమవారం వలసపాకలులో మాజీ ఎంఎల్‌ఎ పిల్లి అనంతలక్ష్మి, నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి దంపతులను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని పిల్లి దంపతులు శాలువాతో సత్కరించారు. అనంతరం నియోజకవర్గంలో నెలకున్న సమస్యలను పార్టీ నాయకులు, కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో గొడవలు ఉన్నట్టే నియోజవర్గంలో కూడా చిన్నచిన్న సమస్యలు ఉన్నాయని, అవి తమ దృష్టికి వచ్చాయని, ఆయా సమస్యలను వెనువెంటనే పరిష్కారం చేసే దిశగా పిల్లి దంపతులను కలవడం జరిగిందన్నారు. టిడిపి, జనసేన మధ్య ఉన్న ఐక్యతను దెబ్బతీసేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు ఒకే పడవలో ప్రయాణించేందుకు వీలుగా సిఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లతో మాట్లాడతానని అన్నారు. కూటమి ప్రభుత్వంపైన విషప్రచారం చేయడం తప్పితే జగన్ అనుకూల మీడియాకు వేరే పని లేదన్నారు. వరదల కారణంగా గుప్పెడు ఇసుకను కూడా బయటకు తీసే పరిస్థితి లేనిప్పుడు ఇసుక అక్రమ రవాణా ఏవిధంగా సాధ్యమని ప్రశ్నించారు. అధికారం కోల్పోవడంతో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి మానసికంగా కుంగిపోయి ఇష్టా రీతిలో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కష్టకాలంలో ఎన్నో ఒడిదుడుకులను తట్టుకుని పార్టీకి మాజీ ఎంఎల్‌ఎ పిల్లి అనంతలక్ష్మి దంపతులు అండగా నిలిచారని అన్నారు. ఎంఎల్‌ఎ పంతం నానాజీ, పిల్లి దంపతుల మధ్య కలహాలు పెట్టేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, వారిపై తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ కూటమి ఐక్యతను దెబ్బతిసేలా కొంతమంది ప్రత్యర్థులు ఇబ్బందికర పరిస్థితులు సృష్టిస్తున్నారని, ఎంఎల్‌ఎ నానాజీతో తమకు ఎటువంటి ఇబ్బందికర పరిస్థితులు లేవన్నారు.

సిఆర్‌పిడబ్ల్యూ సంఘం అధ్యక్షునిగా మీరా సాహెబ్

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఎపి సిఆర్‌పిడబ్ల్యూ సంఘం జిల్లా అధ్యక్షునిగా మీరా సాహెబ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం సమగ్ర శిక్ష కాకినాడ జిల్లా ప్రాంగణంలో కాకినాడ జిల్లా ఎపి సిఆర్‌పిడబ్ల్యూ సంఘ సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షులు రాంజీ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా ఎన్నికైన మీరా సాహెబ్‌ను పలువురు అభినందించారు.

ఓజోన్ పొరను కాపాడుకుందాం...



బహుమతులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

ప్రజాశక్తి - కాకినాడ

ఓజోన్ పొర పరిరక్షణ ప్రతి ఒక్కరి భాధ్యత అని డివైఇఒ కె.వెంకటేశ్వరరావు పిలుపు నిచ్చారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో వ్యాసరచన, చిత్రలేఖనం, డిబెట్, ఏకపాత్రాభినయం పోటీలను చర్చ్ స్క్వేర్‌లో గల బిఆర్ మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ఈ పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ పోటీలకు 54 పాఠశాల నుంచి 386 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక జీవనం పేరిట రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండిషన్లు వాడకం పెరగడం కూడా ఓజోన్ పొరపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తెలి పారు. అధ్యక్షత వహించిన జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినిల్ మాట్లాడుతూ జీవావరణానికి రక్షణ కవచంగా ఉండే ఓజోన్ పొర మానవ స్వయంకృపారాధం వల్ల నాశనం అవుతుందన్నారు. చేయుత పౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఎం.రవికూమర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఓజోన్ పొర పరిరక్షణ కు ప్రతి ఒక్కరు మెక్కలు పెంచాలన్నారు. కందుకూరి మెర్సి సుబ్బరావు ఫౌండేషన్ అధ్యక్షులు కందుకూరి పాల్ రాజు మాట్లాడుతూ కాలుష్యం వల్ల ఓజోన్ పొరనెమ్మదిగా కరిగి రంధ్రాలు పడుతున్నట్లు పర్యావరణ నిపుణులు గుర్తించారన్నారు. వాహనాలు నుంచి వెలువడే క్లోరోఫోరో కార్బన్స్ ఓజోన్ పొరపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ, జాతియ బాలల సైన్స్ క్రాంగెస్ జిల్లా సమన్వయ కర్త కేసరి శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పిల్లి గోవిందరాజులు, డి. శిరీష, పి.వీరభద్రరావు, వివిఎం జిల్లా సమన్వయ కర్త డి.శివప్రసాద్, చేయుత ఆర్థిక కార్యదర్శి చింత నారయణ మూర్తి, సాయి సుధాకర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు కందుకూరి మెర్సి సుబ్బరావు ఫౌండేషన్ అధ్యక్షులు కందుకురి పాల్‌రాజు సౌజన్యంతో అందించారు.

మద్యాన్ని నియంత్రించాలి

ప్రజాశక్తి - పిఠాపురం

మద్యాన్ని నియంత్రించి నిత్యావసరవస్తువుల ధరలు తగ్గించాలని మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ ఎన్ సూర్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం నూతన పాలసీ ద్వారా ఎక్సైజ్ ఆదాయాన్ని పెంచుతామంటే ప్రజలందరినీ మద్యానికి బానిసలను చేయడమేనని అన్నారు. మద్యం కారణంగా నేరాలు రెట్టింపు అవుతున్నాయనన్నారు. తాగేవాళ్ళ సంఖ్యను తగ్గించాల్సింది పోయి మద్యాన్ని ఆదాయ వనరుగా చూడడం బాధాకరమన్నారు. మద్యం పాలసీని రూపొందించడంలో ప్రభుత్వం లక్ష్యం ఏమిటిని ఆయన ప్రశ్నించారు.మంచి నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తెస్తామని ఎన్నికల సమయంలో టిడిపి ప్రకటించిందన్నారు. నాణ్యమైన మద్యం ప్రజల ప్రాణాలు తీయదా, మహిళలపై హింసకు కారణం కాదా, నేరాలు పెరగకుండా నిరోధిస్తుందా అని నిలదీశారు. తక్షణమే మద్యంను నియంత్రించి నిత్యవసర సరుకుల ధరలను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయ దంపతులకు ఉత్తమ అవార్డులు



అవార్డులను అందుకుంటున్న శ్రీరామచంద్రమూర్తి, పద్మజ

ప్రజాశక్తి - సామర్లకోట

పిఠాపురం మండలం మూలపేట జడ్‌పి హెచ్‌ఎస్ ప్లస్ గణిత ఉపాధ్యాయుడు నల్లం అచ్యుత రామచంద్రమూర్తి, ఆయన సతీమణి, యు.కొత్తపల్లి జడ్‌పి హెచ్‌స్ ప్లస్ బాలుర అంగ్ల ఉపాధ్యాయురాలు యాళ్ళ పద్మజ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారు. ఆదివారం గుజరాత్ రాష్ట్ర పాటన్‌కు చెందిన శిక్ష సాగర్ ఫౌండేషన్ కార్యాలయంలో వివిధ రాష్ట్రాలకు చెరందిన ఉపాధ్యాయులకు సత్కారం జరిగింది. ఈ సత్కారాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి వీరు విద్యార్థులకు మెలుకువలతో విద్యాబోధన చేయడమే కాకుండా, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తాము చేస్తున్న కృషికి గుర్తింపుగా పద్మశ్రీ అవార్డు గ్రహీత జ్ఞానాజీ పటేల్ చేతుల మీదుగా ఈ అవార్డులను అందుకున్నట్లు వారు తెలిపారు. జాతీయ స్థాయిలో అవార్డులను అందుకున్న ఉపాధ్యాయ దంపతులను ఆయా మండలాల ఎంపిపిలు, సర్పంచులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.

వ్యవసాయంలో పశు సంరక్షణ కీలకం


మినరల్ మిక్సర్‌ను అందుకుంటున్న రైతు

ప్రజాశక్తి - కాజులూరు

వ్యవసాయంలో పశు సంరక్షణ కీలకమనిజిల్లా పశు వైద్య శాఖ సంచాలకులు అంబేద్కర్ అన్నారు. సోమవారం మండలంలోని పెదలంక గ్రామంలో ప్రకృతి విపత్తు కార్యక్రమంలో భాగంగా ఉచిత పశు వైద్య శిభిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ మాట్లాడుతూ ఇటీవల సంభవించిన ప్రకృతి విపత్తు వల్ల అనేక వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు చింత శ్రీనివాస్‌సుధీర్, రామకోటేశ్వరరావు, సచివాలయ పశు వైద్య సహాయకులు దుర్గాప్రసాద్, స్థానిక రైతులు పాల్గొన్నారు.


బస్సు షెల్టర్ ప్రారంభం


బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ చినరాజప్ప

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట భీమేశ్వర స్వామి ఆలయానికి వచ్చే యాత్రికల సౌలభ్యం కోసం దాత తలుపుల అంజన్‌కుమార్ ఏర్పాటు చేసిన బస్ షెల్టర్‌ను ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప సోమవారం ప్రారంభించారు. తొలుత భీమేశ్వర ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ బల్ల నీలకంఠం, భీమేశ్వర ట్రస్ట్ బోర్డు మాజీ ఛైర్మన్ కంటే జగదీష్‌మోహన్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, పట్టణ టిడిపి అధ్యక్షులు అడబాల కుమారస్వామి, కార్యదర్శి బడుగు శ్రీకాంత్, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్‌లు యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, గోలీ వెంకట అప్పారావు చౌదరి, కౌన్సిలర్ బలుసు వాసు పాల్గొన్నారు.

కార్టూన్ 'నిజం'



బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలి


కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న వెంకటరమణ

ప్రజాశక్తి - కాకినాడరూరల్

గ్రామపంచాయతీ కార్మికులకు చెల్లించాల్సిన వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ మేడిశెట్టి వెంకట రమణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక లక్ష్మీదాస్ భవన్ (సిఐటియు కార్యా లయం)లో ఎపి గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రామ పంచాయతీ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో చాలా పంచాయితీలలో కార్మికులకు నెలల తరబడి వేతనాలు బకాయి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బకా యిలను వెంటనే చెల్లించే విధంగా నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులు అందరికి కనీస వేతనం చెల్లిస్తూ పర్మినెంట్ చేస్తానని గత ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కానీ ఆహామీ అమలు కాలేదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పంచాయతీ వర్కర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ సదుపాయాలని కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. 2015లో హైకోర్టు తీర్పును అనుసరించి కాంట్రాక్టు విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ఆదేశాలను అమలు చేయని అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సహస్రావధాని వరప్రసాద్

ఘనంగా పుస్తకావిష్కరణలు

ప్రజాశక్తి - పెద్దాపురం

సాహితీ స్రవంతి, ఏనుగు లక్ష్మణ కవి సాహిత్య పీఠంల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో పలు పుస్తకావిష్కరణలు జరిగాయి. ఎర్రమిల్లి నాగేశ్వరరావు, తాటి గడప సుబ్బారావు రచించిన 'ఏకమ్' గ్రంథాన్ని, ఎర్రమిల్లి వెంకట రామ అనంత సత్యప్రసాద్ రచించిన 'అనేకమ్' గంథాన్ని ప్రముఖ గురు సహస్రావతాధాని కడిమిళ్ళ వరప్రసాద్ ఆవిష్కరించారు. కుంటముక్కుల సత్యవాణి అధ్యక్షతన జరిగిన ఈ సభలో పుస్తకావిష్కరణ అనంతరం సహస్రావధాని వరప్రసాద్ మాట్లాడారు. అనాదికాలంగా గ్రంథాలు ఈ సమాజానికి ఇచ్చిన సందేశాలను వివరించారు. ఈ రెండు పుస్తకాల సారాంశాన్ని పలువురు వివరించారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి కార్యదర్శి కొత్త శివ, తాటిగడప వెంకటసుబ్రహ్మణ్యం, రాజేశ్వరి, గురులింక ధర్మరాజు, శ్రీవత్స, సలాది సాయి సత్యనారాయణ పాల్గొన్నారు. సహస్రావధాని వరప్రసాద్‌ను, గ్రంథ రచయితలను ఘనంగా సత్కరించారు.

'చేయూత' ఆర్థిక సాయం


కుటుంబానికి చెక్కును అందిస్తున్న చేయూత ప్రతినిధులు

ప్రజాశక్తి - కరప

కరప రామ కంచినగర్‌కు చెందిన దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుడు చోడబత్తుల అబ్బులుకు చేయూత స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సాయం అందించిందని మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు తెలిపారు. బాధితుని ఆర్థిక పరిస్థితిని చేయుత సేవ సంస్థ ఆర్థిక కార్యదర్శి చింత నారాయణమూర్తి దృష్టికి తీసుకెళ్లామని, వెంటనే సంస్థ స్పందించి బాధితునికి రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని కుటుంబానికి సోమవారం అందించినట్లు ఆయన తెలిపారు.

బాలకార్మిక రహిత జిల్లాగా చేసేందుకు చర్యలు

కార్మిక శాఖ జిల్లా ఇన్‌ఛార్జి అధికారి , సహాయ కార్మిక కమిషనర్ బిఎస్‌ఎం. వల్లీ



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

తూర్పు గోదావరి జిల్లాను "బాల కార్మిక రహిత" జిల్లాగా చేయుటకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని కార్మిక శాఖ జిల్లా ఇన్‌ఛార్జి అధికారి, సహాయ కార్మిక కమిషనర్ బిఎస్‌ఎం.వల్లీ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో సంఘటిత, అసంఘటిత రంగాలలో లక్షలాది మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. కార్మిక శాఖ ద్వారా అందించే సేవలను తెలియజేసేందుకు ఆ శాఖ ఉన్నతాధికారిని ప్రజాశక్తి పలకరించింది. ఆయన తెలిపిన వివరాలు మాటల్లోనే...

బాల కార్మిక రహిత జిల్లాగా చేయుటకు పటిష్ట చర్యలు

బాల కార్మిక రహిత జిల్లాగా చేయుటకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నాము. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా టాస్క్ కమిటీ ఆధ్వర్యంలో బాల కార్మికులను గుర్తించుటకు నిర్వహించుచున్న ప్రత్యేక తనిఖీలలో 52 మంది బాల కార్మికులను గుర్తించి యజమానుల పై కేసులు నమోదు చేసి రూ.5,400/- జరిమానాను వసూలు చేయడం జరిగినది. అదే విధంగా 1948 కనీస వేతనముల చట్టం ద్వారా బాల కార్మికులకు రావలసిన రూ.79,292/- సొమ్మును యజమానులు నుంచి ఇప్పించటం జరిగింది.

యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు

జిల్లాలో వాణిజ్య సంస్థల యజమానులు, షాపుల నిర్వహకులు బాల కార్మికులను పెట్టుకుని పని చేయించుకోరాదు. బాల కార్మికులను పెట్టుకుని పని చేయించుకున్నట్లు నిర్ధారణ అయితే బాల మరియు కౌమార కార్మికుల (నిర్మూలన మరియు క్రమబద్ధీకరణ) చట్టం, 1986 క్రింద శిక్షార్హులు. అదే విధంగా బాల కార్మికులను పెట్టుకుని పనిచేస్తున్నట్లు తెలిస్తే, సదరు వివరాలను స్థానిక కార్మిక శాఖ అధికారులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

వివిధ కార్మిక చట్టముల క్రింద రిజిస్ట్రేషన్/ లైసెన్స్

తూర్పు గోదావరి జిల్లాలోని షాపులు మరియు వాణిజ్య సంస్థల యజమానులు కార్మిక చట్టముల కింద తీసుకొనవలసిన అన్ని రిజిస్ట్రేషన్లు/ లైసెన్సులు ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ చట్టం, 2015 క్రింద ఒక పత్రములో తీసుకొనవచ్చును. యజమాని తన షాపునకు సంబంధించి రిజిస్ట్రేషన్/ లైసెన్సు కొరకు ఈ దిగువన తెలిపిన పత్రములను తీసుకొని దగ్గరలో గల మీ-సేవ కేంద్రమునకు వెళ్లి నమోదు చేయించుకోవాలి.

రిజిస్ట్రేషన్ లైసెన్స్‌నకు కావల్సిన ధృవీకరణ పత్రాలు

షాప్/సంస్థ యజమాని యొక్క ఫోటో మరియు సంతకం(తప్పనిసరి), అదే విధంగా యజమాని యొక్క ఆధార్ కార్డు కాపీ అందజేయాలి. షాప్/ సంస్థ అడ్రెస్స్ తెలిసే ట్రేడ్ లైసెన్స్ /ఇతర లైసెన్స్/నేమ్ బోర్డు/కరెంట్ బిల్ (తప్పనిసరి), యజమానిచే ధృవీకరణ పత్రం/స్వీయ ధృవీకరణ తప్పనిసరి. అదేవిధంగా అందుబాటులో ఉంటే పాన్ నెంబర్, వాట్ సంఖ్య జిఎస్‌టి సంఖ్య తెలపవలెను.

85 శాతం వరకూ ఈ-శ్రమ్ పథకం కింద నమోదు

అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ శ్రమ్ పోర్టల్‌ను ప్రవేశ పెట్టింది. 16-59 సంవత్సరములు మధ్య వయస్సు కల్గి, ఇఎస్ఐ, పిఎఫ్ సభ్యత్వం లేని అసంఘటిత కార్మకులు, ఈ పథకం కింద నమోదు కొరకు అర్హులు. అర్హులైన అసంఘటిత కార్మికులు అందరూ తమ ఆధార్ కార్డు నకలు, బ్యాంకు అకౌంట్ నెంబరు మరియు సెల్ ఫోన్ నెంబరు వివరాలతో సమీపంలోని గ్రామ/వార్డు సచివాలయాలు, సిఎస్‌సి సెంటర్‌లలో లేదా ఈ శ్రమ్ అధికారిక



పోర్టల్‌లో ఉచితంగా సెల్ఫ్ రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశం ఉంది. ఎవ్వరైనా నగదు డిమాండ్ చేస్తే కార్మిక శాఖకు ఫిర్యాదు చేయవచ్చు. జిల్లాలో 3,20,279 మంది అసంఘటిం కార్మకులు నమోదు చేసుకున్నారు.

ఈ-శ్రమ్ పథకం కింద ఎక్స్-గ్రేషియా

ఈ-శ్రమ్ పథకం కింది 31.03.2022 వరకూ నమోదైన కార్మికులు ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత అంగవైకల్యం పొందినట్లయినా, వారికి ప్రభుత్వం రూ.2,00,000/- ఆర్థిక సాయం అందించబడును. అదేవిధంగా పాక్షిక అంగవైకల్యం పొందినట్లయితే రూ.1,00,000/-ఆర్థిక సాయం అందిస్తోంది. ఎక్స్-గ్రేషియా కొరకు నామినీల నుంచి దరఖాస్తులు స్వీకరించుటకు గడువును కేంద్ర ప్రభుత్వం 31.12.2024 వరకూ పొడిగించారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

పోలింగ్ కేంద్రం మార్పునకు తీర్మానం

ప్రజాశక్తి - సామర్లకోట

రానున్న టీచర్స ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రం మార్పునకు అఖిలపక్షం ఆమోదిస్తూ తీర్మానం చేసిం దని తహశీల్దార్ కె.చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. పోలింగ్ కేంద్రం మార్పుపై సోమవారం అఖిలపక్షం సమవేశం జరిగింది. ఈ సందర్భంగా పోలింగ్ స్టేషన్‌లో కొంత భాగం శిధిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాన్ని ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించాలని తీర్మానించినట్లు చెప్పారు. అఖిలపక్ష ప్రతిపాదనను కలెక్టర్‌కు నివేదిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు అడబాల కుమారస్వామి, తోటకూర శ్రీనివాస్, తాటికొండ అచ్చిరాజు, విత్తనాల వెంకటరమణ, సరోజ, పిట్టా జానకిరామారావు, పేదిరెడ్ల సత్యనారాయణ, పాల్గొన్నారు.




అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న తహసిల్దార్

ఘనంగా వినాయక నిమజ్జనాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

పెద్దాపురం గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా పట్టణ, మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా కార్య క్రమాల్లో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు, గొర్రెల రమేష్, దాసరి త్రినాథ్, లక్ష్మణ్ దివాకర్ పాల్గొన్నారు. **యు.కొత్తపల్లి** సముద్రతీరంలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. మండలంలో వివిధ ప్రాంతాల నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి ఉప్పాడ, ఎస్‌పిజిఎల్ శివారు, నేమం, లైట్ హౌస్ బీచ్ సముద్ర తీరంలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. పిఠాపురం సిఐ సారథ్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. **తాళ్లరేవు** మండలంలోని పలు ప్రాంతాల్లో గణేష్ నిమజ్జన కార్యక్రమాలు జరిగాయి. తాళ్ళరేవు పంచాయతీ శ్రీరామ్ నగర్‌లో అన్నదానం నిర్వహించారు. జి. వేమవరం పంచాయతీమట్లపాలెం కాలనీలో లడ్డూ వేలంపాటి జరిగింది. 51 కేజీల లడ్డును వైసిపి నాయకుడు దెయ్యాల సత్తిబాబు రూ. 33 వేలకు పాడారు. **కాకినాడ రూరల్** మండలంలోని తూరంగి, ఇంద్రపాలెం, చీడిగ, రమణయ్య పేట, వాకలపూడి, వలసపాకల గ్రామాలను నగర పాలక సంస్థలో విలీనం చేయాలంటూ వినూత్నంగా వినాయక నిమజ్జనం సందర్భంగా ఫ్లెక్సీలు ప్రదర్శిస్తూ ఊరేగింపులు నిర్వహించారు. **సామర్లకోట** పట్టణ, మండల పరిధిలో వినాయక చవితి ముగింపు సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షులు తమ్మల రామస్వామి పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, వల్లూరి దొరబాబు, గోల్తి సత్యనారాయణ, కంటే జగదీశ్ పాల్గొన్నారు.



యు.కొత్తపల్లి బీచ్‌లో నిమజ్జనంలో యువకులు

ఏకాగ్రతతో శ్రమిస్తేనే ఉన్నత విజయాలు

ప్రజాశక్తి - కాకినాడ

విద్యార్థి అటు తరగతి గదిలో గాని, ఇటు ఆయా పాఠ్యాంశాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులు బోధించే అంశా లను ఆకళింపు చేసుకుని ఏకాగ్రతతో శ్రమిస్తేనే ఉన్నత విజయాలను సాధించగల్గుతారని జెఎన్‌టియుకె ఇన్‌ఛార్జ్ ఉప కులపతి ప్రొ.కెవిఎస్. మురళీకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక ఎన్‌ఎఫ్‌ఎసిఎల్ రోడ్డులో గల జి-కన్వెన్షన్ హాలులో అగస్త్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో బికమింగ్ ఏ జీనియస్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ డిఎన్.రావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు తమలో తమను ప్రశంసించు కున్నప్పుడే మనిషిలో ఒక ఆత్మవిశ్వాసం కలుగుతుందని, అలాగే తల్లిదండ్రులు తమ పిల్లలను నిరంతరం ప్రోత్సహిస్తూ ఉత్సాహ పరిచినపుడే వారిలో సానుకూల దృక్పథం ఏర్పడి భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ప్రపంచానికి పరిచయం అవుతారన్నారు. విజయానికి ముందు వినయం ఉంటుందని, అలాగే పతనానికి ముందు పొగరు ఉంటుందని, వినయంతో ఉన్నవారు ముందుకు దూసుకువెళ్తారన్నారు. ప్రపంచానికి భారతదేశం విశ్వ గురువు అని, విదేశాలలోని విద్యార్థులకు సైతం అక్కడి ప్రభుత్వాలు భారతదేశానికి వచ్చేందుకు వీసా లేకుండా అనేక దేశాలు అనుమతులు ఇస్తున్నాయన్నారు. కని పెంచిన తల్లిదండ్రులను గౌరవించాలని, వారిని తమకు తత్త్వవేత్తగాను, మార్గదర్శిగాను తీసుకుని ముందుకు సాగడం ద్వారా విజయపథంలో దూసుకు వెళ్లవచ్చునన్నారు. అగస్త్య మహా ముని గొప్పతనాన్ని తెలిపి ఆ పేరుతో ఏర్పడిన అగస్త్య విద్యా సంస్థలు అనతికాలంలో సాధించిన విజయాలను ఆయన అభినందించారు. అనంతరం ఐఐటి, ఎన్‌ఐటి, నీట్, ఎపి ఎంసెట్లలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి ఉన్నత విద్యాసంస్థలలో సీట్లు సాధించిన విద్యార్థులను జ్ఞాపికలతో సత్కరించి అభినందించారు. ఈ కార్య క్రమంలో అగస్త్య విద్యాసంస్థల ప్రిన్సిపల్స్, వైస్ ప్రిన్సిపల్స్, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులను జ్ఞాపికలతో సత్కరించిన అతిథులు

ఆటో కార్మికుల ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక లింగంపర్తి రోడ్ విజయ దుర్గ ఆటో స్టాండ్ కార్మికులు సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాన అర్చకులు మాసరి నాగమృత్యుంజయ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు దుళ్ళ బాబు, అధ్యక్షుడు బొగ్గు వెంక న్న, కోరుకొండ సాయి, నడికట్ల వెంకన్న, సిరిబోలు వీరబాబు, సుంకర శ్రీను, చిత్రాడ సత్తిబాబు, బుగతా రాంప్రసాద్, లలితా ప్రింటర్స్ అధినేత పతివాడ పవన్ కుమార్ పాల్గొన్నారు.

గ్రామ సభలకు ఘన కీర్తి : అడబాల

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో గత నెలలో నిర్వహించిన గ్రామ సభలకు ఎంతో ఘనకీర్తి దక్కిందని మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ అన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2024- 25లో చేపట్టనున్న ఉపాధి హామీ పనులకు సంబంధించి గ్రామపంచాయతీల్లో మును పెన్నడూ లేనివిధంగా గ్రామ సభలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

19 న హుండీల ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతిలో ఉన్న శృంగార వల్లభ స్వామి ఆలయంలో హుండీల ఆదాయం ఈ నెల 19వ తేదీన లెక్కింపు జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఆరోజు ఉదయం 9 గంటలకు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారుల సమక్షంలో హుండీలను తెరిచి లెక్కింపు జరుపుతారన్నారు.

బోటు క్లబ్‌కు బెంచీల వితరణ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

బోటు క్లబ్ ఉద్యానవనంకు వచ్చే వాకర్స్ సౌలభ్యం కోసం ఎంఎల్ఎ పంతం నానాజీ బెంచీలను వితరణ చేశారు. ఈ సందర్భంగా వాకర్స్ సంఘ అధ్యక్షులు అడబాల రత్నప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల ఉద్యానవనాన్ని సందర్శించిన ఎంఎల్ఎ నానాజీ దృష్టికి బెంచీలు సమకూర్చమని కోరడం జరిగిందన్నారు. దానిపై స్పందించి బెంచీలు సమకూర్చారని, ఇవి వాకర్స్‌కు, పార్కు సందర్శకులకు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. వాకర్ వై.కృష్ణ బెంచీలను ప్రారంభించి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోతుల బాబురావు, ఐరెడ్డి వెంకటరావు, పోతుల వెంకటరమణ పాల్గొన్నారు.



బెంచీలపై కూర్చున్న వాకర్స్

ఘనంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి

ప్రజాశక్తి - పెద్దాపురం

భారతరత్న మోక్ష గుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలను సోమవారం ఎసిటి సైన్స్ సెంటర్, చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వ ర్యంలో ఘనంగా నిర్వహిం చారు. స్థానిక రామారావు పేటలోని సైన్స్ సెంటర్‌లో జరిగిన వేడుకల్లో ఆయ న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్, చిల్డ్రన్స్ క్లబ్ అధ్య క్షులు కూనిరెడ్డి అరుణ మాట్లాడారు. ఈ కార్య క్రమంలో డిప్లమో పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.



విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

ఘనంగా నిమజ్జనాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో గణపతి నిమజ్జనాలు సోమవారం యాత్రికులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పోలీసులు గణపతి నిమజ్జన కార్యక్రమాలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. గణపతి పందిళ్ల వద్ద లడ్డూ పాటలను నిర్వహించారు. భారీ అన్నదానాలు చేశారు.

ఆలమూరు: మడికి శ్రీఅభయాంజనేయ అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్లో కమిటీ వారు ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాన్ని భారీ ఊరేగింపుతో తూర్పు డెల్టా ప్రధాన కాలువలో నిమజ్జనం చేశారు. అలాగే మండలంలోని 18 గ్రామాల నుంచి గణనాథుల విగ్రహాలను పోలీస్, రెవెన్యూ, పంచాయతీ శాఖలు సంయుక్తంగా గుర్తించిన కాలువ రేవుల్లో నిమజ్జనాలను పూర్తి చేశారు. ప్రధాన కాలువల వద్ద, గోదావరి నది తీర ప్రాంతంలోనూ సిఐ సిహెచ్.విద్యాసాగర్, ఎస్ఐ ఎం.అశోక్ ల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. **కపిలేశ్వరపురం :** గ్రామాల్లో గణేష్ ఆలయాల వద్ద, శిబిరాల వద్ద నెలకొల్పిన గణేష్ విగ్రహాలను వాహనాల్లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలన్ను ఊరేగింపు జరిపి గౌతమి గోదావరి నదిలో గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేశారు. గోదావరి నది వద్ద అంగర ఎస్ఐ డి. రవికుమార్‌ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. అంగర అది గణపతి ఆల యం వద్ద కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి లడ్డు వేలంలో గ్రామానికి చెందిన యానాల సీతారామయ్య 10 కేజీల లడ్డును రూ.3 వేలు కు దక్కించుకున్నారు. **రామచంద్రపురం:** నియోజకవర్గంలోని పలు వినాయకుని విగ్రహాలను కోటిపల్లి గోదావరిరేవులో నిమజ్జనం చేశారు. యాత్రికులు నిమజ్జన కార్యక్రమాల్లో పాల్గొన్నారు పలు మండపాల వద్ద భారీ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కోటిపల్లి రేవులో కె.గంగవరం పోలీసులు బందోబస్తు నిర్వహించారు. **రావులపాలెం:** రావులపాలెం గ్రామంలోని గ్రామపంచాయతీ వెనుక వీధిలో కొలువై ఉన్న గణనాథుని విగ్రహాన్ని లక్ష్మీ గణపతి యూత్ ఆధ్వర్యంలో ఊరేగింపు చేసి ప్రధాన పంట కాలువలో నిమజ్జనం చేశారు.మండల కేంద్రం రావులపాలెం రైతు బజార్లో వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. రైతు బజార్లో రైతు బజార్ ఎస్టేట్ అధికారి గోకరకొండ సుబ్బారావు ఆధ్వర్యంలో లడ్డూల వేలం నిర్వహించారు. అయిదు కేజీలు లడ్డూను ఆకన ఏసు అనే రైతు రూ.3600 పాట దక్కించుకోగా, రెండు కేజీలు లడ్డూను కర్రి నాగేంద్ర రూ.1700కు పాట దక్కించుకున్నారు. **మామిడికుదురు :** బి.దొడ్డవరం గణపతి ఆలయంలో వినాయక విగ్రహాన్ని మహిళల తీన్మార్ విన్యాసాలు,యువతుల కోలాట విన్యాసాలతో ఊరేగించారు. బి.దొడ్డవరం, బొలిశెట్టి వారి పాలెం లో భారీదానం చేశారు. పాశర్లపూడి కొండాలమ్మ చింత సెంటర్లో అడబాల బ్రదర్స్ వారిచే భారీ అన్న దానం నిర్వహించారు. **రాజోలు :** వశిష్టా గోదావరిలో వినాయక నిమజ్జనాన్ని రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ ప్రారంభించారు. సుమారు 100కు పైగా విగ్రహాలను యాత్రికులునిమజ్జనం చేశారు. నిమజ్జనానికి వచ్చే వారికి పులిహార పొట్లాలను ముదునూరి అక్కిరాజు ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు ఎం లతేంద్ర వర్మ ఏర్పాటు చేశారు. నిమజ్జన కమిటీ ఎంఎల్ఎకు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రేవు జ్యోతి, సిఐ నరేష్ కుమార్,ఎస్ఐ రాజేష్ కుమార్ నిమజ్జన కమిటి సభ్యులు తదితరులు ఉన్నారు.



మామాడికుదురు మండలం బి.దొడ్డవరంలో యువతుల కోలాటం

మంత్రి 'నిమ్మల' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-అమలాపురం

విజయవాడ వరదల్లో రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు సేవలు అభినందనీయమని అమలాపురం టిడిపి నాయకులు అన్నారు. సోమవారం అమరావతిలో మంత్రిని అమలాపురం టిడిపి నేతలు కలిశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ చిక్కాల గణేష్, ఒలింపిక్ అసోసియేషన్ కోనసీమ అధ్యక్షులు అల్లాడ శరత్ బాబు, దేశం నాయకులు గంధం పల్లంరాజు, కొమ్ముల సురేష్ తదితరులు ఉన్నారు.

వెంకన్న ఆలయంలో స్వచ్ఛతాహి సేవ

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నందు మంగళవారం నుండి వచ్చే నెల రెండో తేదీ వరకు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ భూపతి రాజు కిషోర్ కుమార్ సోమవారం తెలిపారు. దేవదాయ శాఖ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

నేటి నుంచి గ్రామాల్లో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టబోయే పరిశుభ్రతకు సంబంధించిన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు మండలంలో 17 గ్రామాల్లో మంగళవారం నుంచి వచ్చేనెల రెండో తేదీ వరకు నిర్వహిస్తారని ఎంపిడిఒ నాతి బుజ్జి సోమవారం తెలిపారు. పరిశుభ్రత, పరిశుభ్రతను పెంపొందించడానికి స్వచ్ఛతాహి సేవా కార్యక్రమము ఎంతగానో దోహదపడుతుందన్నారు.

గుండెపోటుతో శంకర్రావు మృతి

ప్రజాశక్తి-మామిడికుదురు

జిల్లా వృత్తి కళాకారుల సంక్షేమ సంఘ ఆర్గనైజింగ్ కార్యదర్శి వాసంశెట్టి శంకర్రావు(65) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు ఆయనకు భార్య,కుమారుడు, కుమార్తె ఉన్నారు బాల బాలాజీ ధర్మకర్తల మండలి సభ్యులుగా, బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధిగా, టిడిపి సీనియర్ నాయకునిగా సేవలందించారు ఆయన మృతికి జెడ్‌పి మాజీ ఛైర్మన్ నామన రాంబాబు, పెదపట్నం లంక సర్పంచ్ సుందరనేడి రాజేష్ కుమార్, బోనం బాబు, కొమ్ముల నంది బాబు, రాజోలు తాలూకా శెట్టి బలిజ సంక్షేమ సంఘం పెద్దలు సంతాపం వ్యక్తంచేశారు.

నేరాలు ఘోరాలు

బైకుల చోరీ కేసులో నలుగురు మైనర్ల అరెస్ట్

ప్రజాశక్తి - కడియం

మండలంలో ఇటీవల జరుగుతున్న మోటార్ సైకిల్ చోరీల కేసులో నలుగురు మైనర్లను పోలీసులు అరెస్టు చేశారు. వరుస బైకు చోరీలపై రాజమహేంద్రవరం సౌత్ జోన్ డిఎస్‌పి భవ్యకిషోర్, కడియం సిఐ వెంకటేశ్వరరావు ప్రత్యేక పోలీస్ బృందాన్ని ఏర్పాటు చేశారు. కడియం ఎస్ఐ నాగదుర్గాప్రసాద్‌కు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు తన సిబ్బందితో మండలంలోని మాధవరా యుడు పాలెం పంచాయతీ పరిధి చైతన్యనగర్ శివారు దాండుబాబు గుడి వద్దకు వెళ్లారు. నలుగురు మైనర్లు మోటార్ సైకిళ్లపై అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఎస్ఐ వారిని ఆపి విచారించారు. ద్విచక్ర వాహన పత్రాలను పరిశీలించి చోరీకి గురైన బైకులుగా గుర్తించారు. వారిని స్టేషన్‌కు తరలించారు. వీరు పందలపాక, జి.మామిడాడ గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. కడియం, రాజానగరం, పెరవలి, పెద్దాపురం, సర్పవరం, రాజమహేంద్రవరం, యానాం పరిధిలో 10 ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్టు గుర్తించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. మైనర్లను చాకసక్యంగా పట్టుకున్న హెడ్ కానిస్టేబుల్ కె.సురేష్‌బాబు, కానిస్టేబుళ్లు ఎం.సురేష్ కుమార్, జి.రవికుమార్, కెవి.లక్ష్మణ్, వి.శివకృష్ణ, పి.భీమారావు, వై.రాహుల్, యు.నాగబాబు, కుమార్‌లను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

తాండవలో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - కోటనందూరు

తుని పట్టణంలో కొట్రోళ్ళు కొండ వద్ద తాండవ రిజర్వాయర్లో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తుండగా ఒక యువకుడు గల్లంతై మృతి చెందాడు. తుని పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..తుని పట్టణ బైరాగు వారి వీధికి చెందిన ఉండూరి మణికంఠ(28) వినాయక విగ్రహం నిమజ్జనంలో పాల్గొన్నాడు. తాండవ రిజర్వాయర్‌లో విగ్రహాన్ని నిమజ్జనం చేస్తుండగా గల్లంతై మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పోలేకుర్రు, జార్జిపేట వై.జంక్షన్ వద్ద ఆదివారం రాత్రి గుర్తుతెలియని కారు ఢీకొని ఒకే కుటుంబానికి చెందిన నలుగురు గాయాలపాలయ్యారు. కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్ళరేవుకు చెందిన ఒక కుటుంబం ద్విచక్ర వాహనంపై యానం వెళ్లి తిరిగి వస్తుండగా వై.జంక్షన్ వద్ద కారు వేగంగా వచ్చి బైకును ఢీ కొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తాళ్ళరేవు గ్రామానికి చెందిన వాతాడి ఉమాదుర్గాప్రసాద్, అతని భార్య నూకరత్నం, చిన్నారులు త్రిగుణ బాలశ్రీ, ప్రసన్నకృష్ణలు గాయాలపాలయ్యారు. స్థానికులు వారిని తాళ్ళరేవు సామాజిక ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారు ఆచూకీ తెలియలేదని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - పెద్దాపురం, కోటనందూరు

పెద్దాపురం పట్టణ పరిధిలోని వరహాలయ్య పేటలో ఆదివారం అర్ధరాత్రి సిఐ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో తొమ్మిది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.2.44 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే తుని రూరల్ ప్రాంతమైన తేటగుంట గ్రామ సమీపంలో పేకాట శిబిరంపై ఆదివారం అర్ధరాత్రి పోలీసులు దాడి చేసి 9 మందిని అరెస్టు చేసినట్లు తుని రూరల్ ఎస్ఐ కృష్ణమాచారి తెలిపారు. వారి నుంచి రూ.83,910 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడిలో అన్నవరం దేవస్థానంలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

అశ్లీల నృత్యాలపై కేసు నమోదు

ప్రజాశక్తి - మామిడికుదురు

పెదపట్నంలంకలో వినాయకుని నిమజ్జనాలు పురస్కరించుకుని ఆదివారం రాత్రి అశ్లీల నృత్యాల ప్రదర్శన జరగటంతో కమిటీ సభ్యులపై కేసునమోదు చేసి ట్రాక్టర్‌ని, డీజే సౌండ్ బాక్స్‌లను సీజ్ చేశామని నగరం ఎస్ఐ చైతన్యకుమార్ సోమవారం తెలిపారు. ఇక నుంచి మండల పరిధిలో ఎటువంటి అశ్లీల నృత్యాలు గాని, అసాంఘిక కార్యకలాపాలు జరిగిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



బంగారు పతకాన్ని సాధించిన సత్యనారాయణ

పవర్ లిఫ్టింగ్‌లో గోల్డ్ మెడల్

ప్రజాశక్తి - పెద్దాపురం

అమలాపురంలో జరిగిన 11 వ రాష్ట్ర సబ్ జూనియర్ అండ్ జూనియర్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ అండ్ బెంచ్ ప్రెస్ ఛాంపియన్షిప్ - 2024 పోటీలో 105 కేజీల కేటగిరిలో పెద్దాపురం పట్టణానికి చెందిన గొర్రెల సత్యనారాయణ బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా సత్యనారాయణను పలువురు అభినందించారు.

ముస్లిముల ప్రదర్శన

ప్రజాశక్తి - పెద్దాపురం

మిలాదున్ నబీ మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు సోమవారం పెద్దాపురంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కబాడి వీధిలోని మసీదు సెంటర్ నుంచి అగ్రో మాజీ డైరెక్టర్ సయ్యద్ కరీం ఆధ్వర్యంలో పురవీధులలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కేకు కట్ చేశారు. పలువురు ముస్లిం ప్రతినిధులు సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అగ్రో మాజీ డైరెక్టర్ సయ్యద్ కరీం, మసీదు కమిటీ అధ్యక్షులు సయ్యద్ అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.